క్లుప్తంగా

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: మండలంలోని ఎల్‌కోట మాజీ సర్పంచ్ ఆవులపాటి శ్రీనివాసరావు (50) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు లింగోజిపల్లిలో మృతుడి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, కొత్తపల్లి శ్రీను, జగన్, కటికల భాస్కర్, రాజు ఉన్నారు.

నేటి నుంచి మూడు రోజులు ఆలయ ప్రతిష్ఠ

దర్శి: మండలంలోని శామంతపూడి గ్రామంలో సపరివార సమేత చెన్నమల్లికార్జునస్వామి, చెన్నకేశవస్వామి ధ్వజస్తంభ శిఖరముల ప్రతిష్ఠ మహోత్సవాన్ని మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యులు కారంచేటి దక్షిణామూర్తి గురుకులు శివాచార్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

గిద్దలూరు రూరల్: అరుణాచలం పుణ్యక్షేత్రానికి గిద్దలూరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ రాత్రి ఇక్కడి నుంచి బయల్దేరి 30వ తేదీ నాటికి కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని అక్కడి నుంచి అరుణాచలం చేరుకుంటారని చెప్పారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసుకున్న తర్వాత మరుసటి రోజు బస్సు అక్కడి నుంచి తిరిగి బయల్దేరుతుందన్నారు. బస్సుకు పోను రాను రూ.2,500 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 96765 66935 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్టలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యమిత్ర శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రాఘవేంద్ర



రాఘవేంద్ర

తాళ్లూరు (ముండ్లమూరు): మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా కే రాఘవేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ కొండా యుగకీర్తి వృత్తిపరమైన శిక్షణకు వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా మద్దిపాడుకు చెందిన ఎంపీడీఓ శ్రీనివాసరావు ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన స్థానంలో చీమకుర్తి ఎంపీడీఓగా పనిచేస్తున్న కే రాఘవేంద్రకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించగా పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వాలి

కురిచేడు: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 12 నెలలుగా రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల గౌరవాధ్యక్షులు సందు వెంకటేశ్వరరావు కోరారు. పారిశుధ్య కార్మికులతో కలిసి సోమవారం పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీకి వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

పుల్లలచెరువు: వైఎస్సార్ క్రాంతి పథంలో వీవోఏలుగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం అధికారులకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, తాము పడుతున్న ఇబ్బందులను, చేస్తున్న పనిని గమనించి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రవికిరణ్, దుర్గ, షాహీనా, మరియరత్నం, జ్యోతి, నాగమణి, రాంబాబు, ఆశోక్ పాల్గొన్నారు.

ఏపీఆర్ సంస్థ సేవలు అభినందనీయం



చర్చిని ప్రారంభిస్తున్న బాలినేని, పక్కన కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి తదితరులు



మహిళా సమాఖ్య భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు బాలినేని, నాగార్జునరెడ్డి



బాలినేనికి స్వాగతం పలుకుతున్న ఏపీఆర్ సంస్థ డైరెక్టర్లు

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఓబులక్కపల్లిలో రెండు చర్చిలు, మహిళా సమాఖ్య భవనం ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే కేపీ, మాజీ ఎమ్మెల్యేలు జంకె, ఉడుముల

పొదిలి రూరల్: ఏపీఆర్ గ్రూపు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. సోమవారం పొదిలి మండలంలోని ఓబులక్కపల్లి ఎస్సీ కాలనీలో ఏపీఆర్ సంస్థ సొంత నిధులతో నూతనంగా నిర్మించిన రెండు చర్చిలతో పాటు, గ్రామంలో నిర్మించిన మహిళా సాధికారత స్వయం సహాయక సమాఖ్య భవనాలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాలినేని మాట్లాడుతూ.. ఏపీఆర్ సంస్థ నిర్వాహకులు స్వగ్రామంపై మమకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. వారు చేసిన మంచి పనులే వారిని గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేశాయన్నారు. ఏపీఆర్ సంస్థ ఆర్థికంగా బాగా అభివృద్ధి చెంది, పొదిలి మండలాన్ని దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆకాంక్షించారు. మంచి పనులు చేసే వారికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. దేవుని దయతో రాష్ట్రంలో నాలుగేళ్లుగా సుపరిపాలన నడుస్తోందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఏపీఆర్ సంస్థ ఎండీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తాము 1994లో వ్యాపారంలోకి అడుగుపెట్టామన్నారు. 2016లో ఏపీఆర్ సంస్థ స్థాపించి, ఎంతో మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. గ్రామ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో ఆరోగ్యపరంగా బాగోలేనివారికి జీవితాంతం ఉచితంగా మందులు ఇస్తామని ప్రకటించారు. అనంతరం పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అతిథులకు ఘన స్వాగతం

ముందుగా అతిథులకు సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బారెడ్డి, ఏపీఆర్ సంస్థ ఎండీ ఆవుల కృష్ణారెడ్డి, డైరెక్టర్లు ఆవుల ప్రవీణ్‌రెడ్డి, సంజీవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జయరామిరెడ్డి, సంగు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి సత్కరించారు. సభ అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, షంషీర్ అలీబేగ్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొదిలి మండల, పట్టణ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు గొలమారి చెన్నారెడ్డి, పేరం సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, పొదిలి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్లు గుజ్జుల రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు అనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, పొదిలి, కొనకనమిట్ల జెడ్పీటీసీ మాజీ సభ్యులు సాయిరాజేశ్వరరావు, మెట్టు వెంకటరెడ్డి, నాయకులు యక్కలి శేషగిరిరావు, గిరిబాబురెడ్డి, ఫిరోజ్, గూడూరి వినోద్, ముల్లా జాకీర్, పులిగొర్ల శ్రీనివాసరావు, మల్లాపురం నరసింహులు, మందలపు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: పట్టణంలో ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీలోని సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు ఆర్టీసీలో సమస్యల గురించి 99592 25702 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

రథశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిశెట్టి



రథశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: కాశీఅన్నపూర్ణాదేవి మాతా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి రథశాలను దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోమవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీసీ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, శివాలయ ట్రస్ట్ బోర్డ్ ప్రతినిధి నారపుశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఎమ్మెల్యే కెపికి వినతిపత్రం ఇస్తున్న ఎపిసాక్స్‌లో కాంట్రాక్టు ఉద్యోగులు

మార్కాపురం: నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పరిధిలో ఏపీసాక్స్ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా హెచ్ఐవీ అండ్ ఎయిడ్స్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నామన్నారు. ఒడిశా, మణిపూర్ రాష్ట్రాల్లో మాదిరిగానే తమనూ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ డేటా మేనేజర్లు ఎస్.మురళీ, టి.శ్రీనివాసులు, కౌన్సిలర్లు కె.మహాలక్ష్మి, ఎం.రామారావు, ఎం.పోతురాజు, బి.లక్ష్మీదేవి, ఎస్.ఎల్లయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఐసీటీసీ కౌన్సిలర్ అరుణ, పీపీటీసీ కౌన్సిలర్ రాజు, డీఎస్ఆర్‌సీ సెంటర్ నుంచి ఎ.వెంకటేశ్వర్లు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల



మార్కాపురంలో చెక్కు విడుదల చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ అరుణ



దర్శిలో చెక్కు విడుదల చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ రజియాబేగం

మార్కాపురం: జగనన్న విద్యా దీవెన కింద మార్కాపురం నియోజకవర్గంలో 5,275 మంది విద్యార్థులకుగాను 4,771 మంది తల్లుల ఖాతాల్లో 3,84,23,288 రూపాయల నగదు జమ చేసినట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎస్.అరుణ తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో బటన్ నొక్కి నగదు విడుదల చేయగా మార్కాపురంలోని ఐడియల్ కళాశాలలో విద్యార్థులు లైవ్ ద్వారా వీక్షించారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు నిధులు విడుదల చేసినట్లు అరుణ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారులు వెంకయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం విద్యార్థులకు విద్యాదీవెనకు సంబంధించిన మూడో విడత నిధులు విడుదల చేసినట్లు సహాయ సంక్షేమ అధికారి షేక్ జబ్బార్ తెలిపారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం విద్యాదీవెన నిధులకు సంబంధించి నియోజకవర్గంలోని వివిధ కాలేజీలకు చెందిన 6,523 మంది విద్యార్థులకు రూ.4.29,34,021 చెక్కులు అందజేశారు. ఆ నగదు విద్యార్థుల తల్లిదండ్రుల అకౌంట్‌లో జమ అవుతుందని తెలిపారు. వార్డెన్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, బాబూరావు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన మూడో విడత నగదు జమ

దర్శి: జగనన్న విద్యాదీవెన పథకం మూడో విడత నిధుల చెక్కును దర్శి ఏఎస్‌డబ్ల్యూఓ షేక్ రజియా బేగం సోమవారం విద్యార్థులకు అందజేశారు. స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరిలో లైవ్ ప్రోగ్రాంను విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. అనంతరం నగదు చెక్కు విడుదల చేశారు. నియోజకవర్గంలోని 6,167 మంది విద్యార్థులకు చెందిన 5,626 మంది తల్లుల ఖాతాల్లో రూ.4,48,49,421 నగదు జమ చేసేందుకు చెక్కు విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ రామకృష్ణారెడ్డి, విద్యార్థు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదు



మాట్లాడుతున్న రామకృష్ణ

మార్కాపురం: విశాఖ ఉక్కు కోసం 928 రోజులుగా కార్మికులు పోరాటం చేస్తున్నారని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని మెయిన్‌బజారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అప్పట్లో విశాఖ ఉక్కుకోసం అదిలాబాద్ నుంచి అనంతపురం వరకు, శ్రీకాకులం నుంచి చిత్తూరు వరకు ఉవ్వెత్తున జరిగిన ఉద్యమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో 32 మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయడంతో విశాఖ ఉక్కు నిలబడిందన్నారు. ఆ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్రం ఇప్పటికైనా మానుకోవాలన్నారు. మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎమ్ఎల్ నారాయణ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీవీ ప్రసాద్, అందె నాసరయ్య, దేవండ్ల శ్రీనివాస్, కాశీం, జాన్సన్, శివారెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

గిద్దలూరు రూరల్: మండలంలోని వెంకటాపురం తండా గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని సోమవారం స్థానిక ఎస్ఐ మహేష్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వెంకటాపురం తండా గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో సంఘటన స్థలం వద్దకు చేరుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.39,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కరాటే విజేతలకు అభినందనలు

పొదిలి: చీమకుర్తిలో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్–2023లో కుమితే, కటాస్ విభాగాల్లో పొదిలి విద్యార్థులు లక్కీషాలోమ్, జోయల్ జస్వంత్, షేక్ సుమయపాతిమ, షేక్ సుఫియా, షేక్ కరీనా బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను మర్రిపూడి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రెబ్బా వెంకటేశ్వర్లు, కోచ్ చినరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు శివ ఆంజనేయులు, షేక్ మహబూబ్‌బాషా ఇన్‌స్ట్రక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కరాటే విజేతలను అభినందిస్తున్న హెచ్ఎం

ఆరు మండలాల నాయకులకు కృతజ్ఞతలు

కొమరోలు: కొమరోలులో ఆదివారం కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన 6 మండలాల వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ నాయకులు కామూరి రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల ప్రారంభోత్సవం సందర్భంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 20 వేల మందితో తాటిచెర్లమోటు నుంచి కొమరోలులో భారీ ర్యాలీ ఏర్పాటు చేసి హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో కామూరి రమణరెడ్డి మాట్లాడుతూ 6 మండలాల నుంచి తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ధన్యవాదాలు తెలిపారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.30 లక్షలు



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం వరకు రూ.2,30,150 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో జి.రమణారెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.92,210, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.30,260, ఆలయం వద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.10 వేలు, ఉచిత ప్రసాదానికి రూ.2500, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.83,180, ఇతర విరాళాల ద్వారా రూ.12,000 వచ్చినట్లు ఈవో, చైర్మన్‌లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు కంచర్ల శ్రీనివాసులు, ప్రవీణ్, బాలిబోయిన వెంకటయ్య, కొండమ్మ, ఉప్పుటూరి మదన్, వల్లూరి నారాయణస్వామి, శిరీష తదితరులు విరాళం నగదును ఆలయ కమిటీకి అందజేశారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంచికంటి మధుసూదనరావు, నాయకులు కొమ్మినేని వెంకట్రావు, చావా సుబ్బయ్య, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సిబ్బందికి యూనిఫాం అందిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, సీడీపీఓ సుశీల

మార్కాపురం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసం వద్ద మార్కాపురం పట్టణ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 208 మంది టీచర్లు, 198 మంది ఆయాలకు, 10 మినీ సెంటర్లలో పనిచేస్తున్న టీచర్లకు యూనిఫాం, వేయింగ్ మిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని, వాటిని ఐసీడీఎస్ సిబ్బంది సంబంధిత లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ బి.సుశీలాదేవీ, సూపర్‌వైజర్లు ఎం.బుజ్జి, కె.రవికుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అధినేతపై చర్యలు తీసుకోవాలి



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఒద్దుల లక్ష్మీరెడ్డి

పెద్దారవీడు: రాష్ట్రంలో శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌లపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు ఒద్దుల లక్ష్మీరెడ్డి కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం పెద్దారవీడు, దోర్నాల పోలీసుస్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేకనే టీడీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేస్తూ అశాంతి కల్గించేందుకు కుట్రలు పడుతున్నారని, ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించడంతో ప్రజలు అదరణ చూపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సొంటి నాగార్జునరెడ్డి, నెహంతుల్లా, ఏర్వ శివారెడ్డి, బెంజి, గుమ్మా అంకయ్య, సయ్యద్ ఖాజా పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర ప్రసాద్

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఇందిర ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని సి.కొత్తపల్లి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను కూడా రోజూ తనిఖీ చేయాలన్నారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వం సూచించిన నియమాలు పాటించాలన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను తనిఖీ చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఓటర్ల సర్వే నిష్పక్షపాతంగా జరగాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ఇంటింటి ఓటర్ల సర్వేను బీఎల్ఓలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు సూచించారు. ముండ్లమూరులో తొలగించిన ఓటర్ల వివరాలపై సోమవారం ప్రత్యేక పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. 216, 217 పోలింగ్ బూతుల పరిధిలో 47 ఓట్లు తొలగించగా ఆయా కుటుంబాలను కలిసి వివరాలు సేకరించారు. 2020 జనవరి 6 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ వరకు బీఎల్ఓ ఫారం–7లో తొలగించిన ఓటర్లను పునఃపరిశీలన చేశారు. తొలగించినవన్నీ నిజమైనవని నిర్ధారించారు. ఆయన వెంట ఎన్నికల ఆపరేటర్ దేవకాంత్, వీఆర్ఏ నాగార్జునరెడ్డి, ఎన్నికల సూపర్‌వైజరు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న సురేంద్రరెడ్డి

మార్కాపురం టౌన్: క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్ తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రఘునాథ్, భానుప్రసాద్ జాతీయ స్థాయి పోటీల్లో సెల్ఫ్ క్లీనింగ్ రోడ్స్ అంశంపై ప్రదర్శనకు తృతీయ బహుమతి సాధించారని చెప్పారు. విద్యార్థులను హెచ్ఓడీలు కె.సురేందర్‌రెడ్డి, కందుల రాజశేఖర్‌రెడ్డి, డిప్లొమో ఇన్‌చార్జి అబ్దుల్ కలాం, సత్యవాణి, పుష్పలత అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

మార్కాపురం టౌన్: విద్యుదాఘాతానికి గురైై ప్రైవేట్ లైన్‌మెన్‌కు గాయాలైన సంఘటన సోమవారం పట్టణంలోని ఏకలవ్య కాలనీలో చోటుచేసుకుంది. కాలనీలో నివాసముండే కాకర్ల చిన్నా సోమవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభం ఎక్కి లైన్ సరిచేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభం మీద నుంచి కిందపడటంతో గాయాలయ్యాయి. ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు.